


# సారాజహాసే అచ్ఛా!

సారా ఉద్యమం ఊపు చూసేసరికి మిగతా అందరి లాగానే మా కాలనీలో కూడా ఎక్కడలేని చైతన్యం వచ్చింది.

ముఖ్యంగా మా కాలనీ ఆడాళ్ళు మరీ రెచ్చిపోయారు. మా కాలనీ ఫ్రీలాన్స్ జర్నలిస్ట్ గోపాల్రావ్ ఆ సందర్భంగా అనేక మంది ప్రముఖులతో ఇంటర్వ్యూలు తీసుకుని ఏదైనా పేపరుకు పంపాలని నిశ్చయించుకున్నాడు.

ఆ ఇంటర్వ్యూలు మేమే తీసుకుంటామని మా కాలనీలోని కొంత మంది వీరవనితలు ముందుకొచ్చారు.

అందరం కలసి ముందు హైద్రాబాద్‌లో షూటింగ్‌కొచ్చిన ఓ సినీ నటుడిని గెస్ట్‌హౌస్‌లో కలుసుకున్నాం!

మమ్మల్ని చూసి లేచి నిలబడి ప్రతి నమస్కారం చేయబోయి తూలి కిందపడిపోయాడతను.

మేమంతా అతనిని లేపి కూర్చోబెట్టాం!

"సార్! ఈ సారా ఉద్యమం మీద మీ అభిప్రాయం ఏమిటి?" అడిగింది డిటెక్టివ్ రచయిత్రి రాజేశ్వరి.

"సారావల్ల ఎన్నో కుషుంబాలు నాషనమవుషున్నాయ్! నేను షూటింగ్‌ల కెళ్ళినప్పుషు ఎంషోమంషి ఆడాళ్ళు పాపం ఎన్నో బాధలు పడషం చూషాను. ఏడుపొచ్చేషింది నాకు! నిజంగా ఏడుపొచ్చేషింది" అంటూ భోరు ఏడ్వేయటం ప్రారంభించాడతను.

మాకు ఏం చేయాలో అర్థంకావటంలేదు.

"ఊరుకోండిసార్! ఏడవకండి! ఏడ్చి చేసేదేముంది? అన్నాడు రంగారెడ్డి ఓదారుస్తూ.

"పాపం ఎంత జాలిగుండెగల మనిషో" అంది పార్వతీదేవి ఆ నటుడిని మరింత గౌరవంగా చూస్తూ.

"ఇప్పష్షే కాదంషీ! షిన్నప్పషి నుంషీ నాది జాలి గుంషే! ఇక్క నిమిషం! ఇప్పష్షే వష్తా" అంటూ పక్కనున్న డ్రస్సింగ్ రూమ్‌లోకెళ్ళి మందు బాటిల్ ఎత్తి తాగేసి బయటికొచ్చాడు.

"అంటే 'సారా'ను బాన్ చేయాలని మీ అభిప్రాయమా?" అడిగాడు చంద్రకాంత్.

"అవును! షారాని బాన్ షేయాల్సిందే! లేకపోషే ఎన్నో కుషుంబాలు నాషనం అయిపోషున్నాయ్–"

అతని అసిస్టెంట్ ఫోన్ తెచ్చిచ్చాడు.

"సార్! మీ భార్యగారు ఫోన్లో వున్నారు"

"హలో! ఛఛ! పీ మీద ఒష్షే! నేను తాగషం లేదు! ప్రామిష్! బాంక్‌లో డబ్బయిపోయిందా? అప్పడే అయిపోయిందా? ఏంషీ! నేను ఆరు నెలల నుంషీ డబ్బివ్వడంలేదా? షరే– ఇప్పడే రెండొందలు పంపిష్తాను! తీషుకుని నెలంతా జాగ్రష్తగా వాడు–"




యర్రంశెట్టి శాయి

ఫోన్‌పెట్టేసి జేబులో నుంచి నోట్ల కట్ట తీసి అసిస్టెంట్‌కిచ్చాడు.

"షూడు రెండొందలు ఇంటికి పంపి మిగతా రెండువేలు మూడొందలు పెట్టి ఫారన్ విస్కీ తీసుకురా!' చెప్పాడతను.

మా కాలనీ ఆడాళ్ళు మొఖమొఖాలు చూసుకున్నారు.

"ఈ షారావల్ల మన షమాజానికి హాని జరుగుషోంది – ఎంత హాని జరుగుతోందంషే – ఎంత హాని జరుగుతోందంషే –" అని దభేల్‌మని పడిపోయాడు నేలమీద.

రాజేశ్వరీ, సావిత్రమ్మా, పార్వతీదేవి కెవ్వున కేకేసి బయటకు పరుగెత్తారు.

అక్కడి నుంచి అందరం మంత్రి గారింటికి చేరుకున్నాం.

మేమంతా ఫలానా పత్రిక తాలూకు అని తెలిసేసరికి అతను మాకు చాలా గౌరవం ఇచ్చాడు.

"ఒరేయ్! ఆడాళ్ళకు కూల్ డ్రింక్స్, మగాళ్ళకు వాట్–69 తీసుకురా!" అని పురమాయించాడు బాయ్‌కి.

మాకు వాట్-69 అనగానే నోరూరిందిగానీ ఆడాళ్ళు పక్కనే వుండటంవల్ల "అబ్బే వద్దండీ వద్దు! మాకస్సలు అలవాటు లేదు" అన్నాం గాబరాగా.

"ఈ సారా వ్యతిరేక ఉద్యమం గ్గురించి మీ అభిప్రాయం ఏమిటి సార్" అడిగాడు గోపాల్రావ్.

"సారా నిజంగా చాలా భయంకరమయిన అలవాటు. మాకు ఓట్లు వేసే ఎన్నో కుటుంబాలు ఈ దురలవాటువల్ల నాశనమవటం నేను చూశాను. ఆ కుటుంబాలను చూసినప్పుడల్లా నేనెంత కుమిలిపోతానో మీకు తెలీదు-" అనేసి కన్నీళ్ళు తుడుచుకున్నాడతను.

అప్పుడే వాళ్ళ మనిషి వచ్చాడు హడావుడిగా.

"సార్! దొంతనంగా మన డిపోకి మొలాసెస్ తెస్తున్న లారీని ఎక్సయిజ్‌వాళ్ళు పట్టుకున్నారంట! రంగా ఫోన్ చేశాడు!"

రాజకీయనాయకుడు మండిపడుతూ ఫోన్ అందుకున్నాడు.

"ఎవడ్రా ఆడు నా లారీని పట్టుకుంది! బతకాలని వుందా లేదా? ముందా ఇన్‌స్పెక్టర్‌ని బదిలీచేసెయ్ నువ్వే నా లారీని డిపోకి తోలుకురా! తెల్సిందా?" అనేసి ఫోన్ పెట్టేశాడు.

"సారాని బాన్ చేయాలని ఉద్యమకారులంటున్నారు. దీని విషయంలో మీ అభిప్రాయం ఏమిటి?"

"నిజమే పాపం! బాన్ చేయాల్సిందే! ఆ ఉద్యమం పదికాలాలపాటు కొనసాగాలని నేను మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. ఒకవేళ బాన్ చేసినా దొంగసారా ఎలాగూ వుంటుంది కనుక బాన్‌చేసినా చేయకపోయినా ఒకటే! అయినాగానీ అన్నీ ఆలోచించి బాన్ చేయాలి. ఎందుకంటే సారా వ్యాపారంమీద ఆధారపడి కొన్ని లక్షల కుటుంబాలు జీవిస్తున్నాయ్. కొన్ని లక్షల మంది ఉద్యోగాల్జేస్తున్నారు. ప్రభుత్వాలు నిలపాలన్నా పడగొట్టాలన్నా సారాయే చేస్తోంది. బలహీనవర్గాలు చేపట్టిన ఈ వృత్తిని నిర్మూలించడంవల్ల ఆ వర్గాలకు బ్రతుకు తెరువుండదు."

"సార్! ఆ సారాలో మందు కలపాలి-"

అతను తన టేబుల్ సొరుగులో నుంచి ఓ పాకెట్ తీసిచ్చాడు.

"ఇందులో సగమే కలపమను! ఎక్కువ కలుపుతే మళ్ళీ జనం ఉస్మానియాలో జాయనయి ఛస్తారు! దాంతో పేపరోళ్ళు మనల్ని రుద్దేస్తారు-"

అక్కడి నుంచీ మేము ఓ రచయిత ఇంటికి వెళ్ళాం!

ఆయన భార్య బయటికొచ్చింది.

"రయితగారిని ఇంటర్వ్యూ చేయాలండీ-"

"ఆయన లేరు-"

"ఎక్కడికెళ్ళారండీ?"

"హాస్పటల్‌కి-"

"ఎప్పుడొస్తారండీ?"

"ఇంకెక్కడొస్తాడు? తాగి తాగి ఛస్తాడు! ఇందాకే ఎవరో వచ్చి చెప్పారు - సినిమా ప్రొడ్యూసర్‌తో చేరి తాగి తాగి రోడ్ మీద పడితే ఎవడో తీసుకెళ్ళి చేర్పించాడంట! ఆ సంగతి చెప్పడానికొస్తేనూ వాడిని చీపురుపట్టుకొట్టాను-" అంది చీపిరి పుల్లలన్నీ జమచేస్తూ.

మేము బెదిరి బయటికొచ్చాము.

ఓ ప్రభుత్వాధికారిని కలుసుకోడానికి ఆఫీసుకెళ్ళాం.

"ఆయన కంట్రాక్టర్తో పాటు బార్‌కెళ్ళారు" చెప్పాడు క్లర్క్.

ఆ బార్‌కి చేరుకుని సారా ఉద్యమం గురించి అడిగాము.

"సారా ఉద్యమం కొనసాగాల్సిందే! ఎంతోమంది సారాకు బానిసలయి కుటుంబాలను బాధలుపెట్టటమే కాకుండా - వాళ్ళు దానిక్కవలసిన డబ్బుకోసం ఎన్నో అవినీతిపనులు చేస్తున్నారు-"


కంట్రాక్టర్ అతని చేతిలో ఓ నోట్ల కట్ట పెట్టాడు.

"ఆ బిల్ పాస్ చేసేస్తారు కద్సార్?"

"సెంట్‌పర్సెంట్ - అసలు నీకా అనుమానం ఎందుకొచ్చింది?"

"ఆ! ఇంకేం కావాలో అడగండీ! సారా నా ఫేవరిట్ సబ్జెక్ట్! ఎంతసేపు కావాలంటే అంతసేపు దానివల్ల వచ్చే నష్టాల గురించి మాట్లాడగలను-"

మర్నాడు పేపర్లో సారా వ్యతిరేకోద్యమాన్ని బలపరుస్తున్నవాళ్ళ ఇంటర్వ్యూలన్నీ వేశాం. అప్పటిగ్గానీ మాకు మానసికంగా సంతృప్తి లేకపోయింది. మేమూ ఆ ఉద్యమాన్ని బలపరచామన్న ఫీలింగ్!




సైన్సు ప్రకారం కూడా తలిదండ్రులకి పుట్టిన బిడ్డ అచ్చుపోసినట్టుగా తనలాగానో, భర్తలాగానో వుండాల్సిన అవసరం లేదు. ఒకే తల్లిదండ్రుల బిడ్డలు ఇద్దరు ఒకేలా వుండనసరం లేదు. అటువంటివార్ని ఎందర్నో మనం నిత్యజీవితంలో చూస్తూనే వుంటాం. తల్లిదండ్రుల పోలికలతోనే పుట్టే బిడ్డల శాతం తక్కువనే చెప్పాలి. తన గర్భంలోంచి పుట్టాడు కాబట్టి ఏవో కొన్నైనా తల్లిపోలికలు రావచ్చు. అవీరాకపోతే అటు తాతగారు - మామ్మగార్లో మేనమామ, మేనత్తల పోలికలో - ఏవో ఒకటి అన్వయించుకోవచ్చు. జన్యుశాస్త్రం (జెనెటిక్స్) ప్రకారం కూడా జీన్స్‌లో మార్పులుజరిగి అసలు వీరి వంశం పోలికలే రాకుండా కొత్త పోలికలు వచ్చే అవకాశం కూడా వుంది.

ఈ విషయమై ఎవరికైనా ఇంకా వివరణ కావలసిన పక్షంలో ఉత్తరాల ద్వారానో, ప్రత్యక్షంగానో నన్ను సంప్రదించవచ్చు.

– డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డి